

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



సరిహద్దు చొరబాటుపై భగ్గుమన్న భారత్..
పాక్ దౌత్యవేత్తకు సమన్లు

సంపుటి:-01, సంచిక:-130, సోమవారం 05-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

- సమాజ్‌వాదీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్
- యూపీలో సీట్ల పంపకాలపై ఎస్పీ, కాంగ్రెస్ మధ్య రాజుకున్న వేడి
- ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారన్న ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్
- సీట్ల పంపకాలపై అక్టోబర్‌లో జరిగే చర్చల్లో అఖిలేశ్‌దే తుది నిర్ణయమని వెల్లడి
- పొత్తు వల్ల కాంగ్రెస్‌కే అధిక ప్రయోజనమని వ్యాఖ్య



- 150 సీట్లు కావాలంటూ ఇప్పటికే తమ మనోగతాన్ని బయటపెట్టిన కాంగ్రెస్ - మిగతా 2 లో

పైలట్‌పై దాడి ఎఫెక్ట్.. టెల్ అవీవ్‌కు విమానాలు నిలిపివేసిన ఫ్లైదుబాయ్

- దుబాయ్ విమానంలో కెప్టెన్‌పై దాడి ఘటన
- అధికారుల ఆదేశాలతో టెల్ అవీవ్‌కు విమాన సర్వీసుల రద్దు
- భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను హీరోగా కొనియాడిన నెతన్యాహు



తమ విమానంలో కెప్టెన్‌పై కో- పైలట్ దాడి చేసిన ఘటన నేపథ్యంలో, ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌కు విమాన సర్వీసులను - మిగతా 2 లో

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు



2 లో..

- పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు
- పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22 వరకు మొత్తం 13 రోజుల సెలవులు
- జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 10 నుంచి 21 వరకు 12 రోజుల పాటు సెలవులు
- అక్టోబర్ 23న స్కూళ్లు, 22న కాలేజీలు తిరిగి పునఃప్రారంభం
- సెలవులకు ముందు రోజే ముగియనున్న సమ్మెటివ్-1 పరీక్షలు

పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్: రేవంత్ రెడ్డి

- ఆన్‌లైన్‌లో పిల్లల సేఫ్టీ.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- మహిళలు, పిల్లల రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వెల్లడి
- సైబర్ క్రైమ్‌కు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098 నంబర్లు గుర్తుంచుకోవాలని సూచన



2లో

డిజిటల్ యుగంలో సైబర్ నేరాల నుంచి పిల్లలకు రక్షణ కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం ఒక సమగ్ర ఫ్రేమ్‌వర్క్‌ను వెంటనే రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

చివరి నిమిషంలో కీలక నిర్ణయం!



- తొలుత అక్టోబర్ 4న పర్యటనకు ఖరారైన షెడ్యూల్
- మెదక్, కరీంనగర్‌లో పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
- షెడ్యూల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- నిరాశలో బీజేపీ శ్రేణులు
- పర్యటనకు కారణాలు వెల్లడించని పార్టీ - మిగతా 2 లో

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది



- సర్పంపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా - మిగతా 2 లో

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే వదంతులు నమ్మొద్దు



2 లో..

- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి

తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా భారత్ కీలక అడుగు

- మోదీ ప్రతిపాదనపై ఉక్రెయిన్ ప్రశంసలు!
- చర్చలో నాలుగు కాల్పుల విరమణ ప్రతిపాదనలు
- భారత్ ప్రతిపాదన సమగ్రంగా ఉందన్న ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి
- ఇంధన రంగంపై దాడులు ఆపాలని కోరుతున్న ఉక్రెయిన్
- నల్ల సముద్రంలో సంధిపైనా జరుగుతున్న చర్చ
- మరోవైపు మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించిన పుతిన్



2లో

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు మరోసారి ఊపందుకున్నాయి. ఈసారి భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ నుంచి కీలక స్పందన వచ్చింది. కాల్పుల విరమణ కోసం

డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు



2 లో..

- విజయవాడలో పాన్ ఐఐటీ సమ్మిట్-2026
- హాజరైన సీఎం చంద్రబాబు
- అమరావతిలో శాశ్వత పాన్ ఐఐటీ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఫిబ్రవరి నుంచి అమరావతిలో క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్
- క్యూ-శివ, అమరావతి డిక్లరేషన్ పాన్ ఐఐటీ సమ్మిట్ లో కీలక ఘట్టాలను ఆవిష్కరించిన చంద్రబాబు
- క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దుతామన్న సీఎం చంద్రబాబు

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 (సా-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దు

మొదటిపేజీ తరువాయి – కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన రద్దయింది. ఒక రోజు పర్యటన నిమిత్తం రేపు ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. దానికి గల కారణాలేంటో అధికారికంగా వెల్లడికాలేదు. షెడ్యూల్ ప్రకారం అమిత్ షా నేటి రాత్రి 9 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, లోక్‌భవన్‌లో బస చేయాల్సి ఉంది. ఆదివారం ఉదయం మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని.. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారని షెడ్యూల్ లో పేర్కొన్నారు. హోంమంత్రి పర్యటన కోసం మెదక్, కరీంనగర్ జిల్లాల యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అయితే పర్యటన రద్దుకు గల కారణం మాత్రం ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఢిల్లీలో అత్యవసర పరిణామాలు లేదా ఇతర అనివార్య కారణాల వల్లే పర్యటన రద్దయి ఉండొచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పర్యటన రద్దుతో బీజేపీ శ్రేణుల్లో నిరాశ నెలకొంది. అమిత్ షా తెలంగాణకు ఎప్పుడు వస్తారనే విషయాన్ని త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

పిల్లల ఆన్‌లైన్ భద్రతకు ప్రత్యేక ఫ్రేమ్‌వర్క్: రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి – (నల్సా) సౌత్ జోన్ రీజనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ ఆదేశాలు జారీ చేశారు. ఆన్‌లైన్‌లో పిల్లలు ఎక్కువ సమయం గడుపుతున్నారని, అక్కడ ఎదురయ్యే ప్రమాదాలపై వారికి సరైన అవగాహన ఉండటం లేదని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జిమెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది

మొదటిపేజీ తరువాయి – మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు

మొదటిపేజీ తరువాయి – వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

యూపీలో కాంగ్రెస్‌కు 50 సీట్లు కూడా ఎక్కువే

మొదటిపేజీ తరువాయి – ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ కనీసం 150 స్థానాల్లో పోటీ చేయాలని చెబుతుండగా.. 50 సీట్లు కూడా ఎక్కువేనని ఎస్పీ ఎంపీ శివ్‌పాల్ సింగ్ పటేల్ అన్నారు. కాంగ్రెస్ తన బలాన్ని బట్టి సీట్లు కోరాలని సూచించారు. కాంగ్రెస్‌కు 50 సీట్లు ఇస్తేనే పెద్ద విషయమని పటేల్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తే కాంగ్రెస్‌కు ప్రయోజనం ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ మాత్రం 150 సీట్లకు తగ్గకుండా పోటీ చేయాలని ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేసింది. యూపీ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ ఈ విషయాన్ని ఇటీవల ప్రకటించారు. 403 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లపై తమకు హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. సీట్ల పంపకంపై చర్చలు అక్టోబర్‌లో జరిగే అవకాశం ఉంది. సీట్ల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోతే పొత్తు ఉద్దేశమే దెబ్బతింటుందని పటేల్ అన్నారు. తుది నిర్ణయం ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ తీసుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాత్రం తమ పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటామని తెలిపారు. ఎస్పీ, కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో కలిసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో ఎస్పీ 37, కాంగ్రెస్ 6 లోక్‌సభ స్థానాలు గెలిచాయి.

పైలట్‌పై దాడి ఎఫెక్ట్.. టెల్ అవీవ్‌కు విమానాలు నిలిపివేసిన ఫ్లైదుబాయ్

మొదటిపేజీ తరువాయి – తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు దుబాయ్‌కు చెందిన విమానయాన సంస్థ ఫ్లైదుబాయ్ ప్రకటించింది. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని, అధికారుల అభ్యర్థన మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు ఫ్లైదుబాయ్ సీఈఓ గైత్ అల్ గైత్ తెలిపారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు 172 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఫ్లైదుబాయ్ ఫ్లీ 1073 విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న సహ పైలట్, భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డాడు. దీంతో విమానం నిమిషం వ్యవధిలోనే దాదాపు 17,000 అడుగుల కిందకు పడిపోయింది. తీవ్రంగా గాయపడినప్పటికీ, కెప్టెన్ స్మిత్ మచ్చర్ ధైర్యంగా కాక్‌పిట్ డోర్‌ను తెరవడంతో ప్రయాణికులు, ఇతర సిబ్బంది లోపలికి ప్రవేశించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబుక్‌లో సురక్షితంగా అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో హీరోగా నిలిచిన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాల్‌లో మాట్లాడి ఆయన ధైర్యాన్ని ప్రశంసించారు. 'ది గార్డియన్' కథనం ప్రకారం, "నా ప్రాణాల కోసం పోరాడాను. నేను లేవకపోతే ప్రయాణికుల ప్రాణాలు పోతాయని గ్రహించి, చివరి శక్తి కూడగట్టుకుని కాక్‌పిట్ డోర్ తెరిచాను" అని కెప్టెన్ మచ్చర్ ప్రధాని మోదీకి వివరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా కెప్టెన్‌ను హీరోగా కొనియాడారు. దాడికి పాల్పడిన ఒమన్ జాతీయుడైన సహ పైలట్‌ను సౌదీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన వెనుక ఉగ్రవాద కోణం ఉందా అనే దానిపై యూఏఈ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఫ్లైదుబాయ్‌తో పాటు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ కూడా టెల్ అవీవ్‌కు తమ కోడ్‌షేర్ విమానాలను రద్దు చేశాయి. దీంతో యూఏఈలో చిక్కుకున్న ఇజ్రాయెల్ పౌరులను స్వదేశానికి తరలించడానికి ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేస్తున్నారు.

పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ.. జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

మొదటిపేజీ తరువాయి – అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (స్టా×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష 1300 మంది పోలీసులతో కీలక భేటీ రేపు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకు 1300 మంది అధికారులతో సమావేశం గంజాయి, సైబర్ క్రైమ్, మహిళలపై నేరాల కట్టడిపై ప్రధానంగా చర్చ పోలీస్ స్టేషన్ల పనితీరుపై నివేదికలతో సమీక్షించనున్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3:30 గంటలకు సచివాలయంలో కీలకమైన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చరిత్రలోనే అరుదుగా, డీజీపీ స్థాయి అధికారి నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వరకు సుమారు 1,300 మంది అధికారులు ఈ సమావేశంలో పాల్గొనబోతుండటం గమనార్హం. ఈ సమీక్షా సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని శాంతిభద్రతలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా వేదికగా సాగుతున్న దుష్ప్రచారాలు, గంజాయి నిర్మూలన, బ్లేడ్ బ్యాచ్‌ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడం వంటి కీలక అంశాలపై చంద్రబాబు చర్చించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై తన వద్ద ఉన్న క్షేత్రస్థాయి నివేదికలను అధికారుల ముందుంచి, ఆయన సమగ్రంగా విశ్లేషించనున్నారు. వివిధ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల పర్యవేక్షణ తీరుతెన్నులపై ముఖ్యమంత్రి నేరుగా సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకే అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా హాజరవుతుండగా, జిల్లా స్థాయి అధికారులు, ఎస్‌హెచ్‌ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొంటారు.

చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది



మొదటిపేజీ తరువాయి – చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు దిశగా భారత్ కీలక అడుగు

తమకు నాలుగు ప్రతిపాదనలు అందాయని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా తెలిపారు. భారత్, అమెరికా, టర్కీ, ఈజిప్ట్ నుంచి వచ్చిన ప్రతిపాదనల్లో.. భారత్ ప్రతిపాదన అత్యంత సమగ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

భారత్ ప్రతిపాదనలో ఏముంది?

భారత్ ప్రతిపాదన వివరాలను పూర్తిగా బయటపెట్టలేదు. అయితే ఉక్రెయిన్ ప్రకారం.. ఇంధన రంగంతో పాటు నల్ల సముద్రంలో కాల్పుల విరమణకు సంబంధించిన అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంధన కేంద్రాలు, ఓడరేవులపై దాడులు నిలిపివేయడం కూడా కీలక అంశంగా ఉంది. నల్ల సముద్రంలో నౌకాయానం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సజావుగా సాగేందుకు ఇది ఉపయోగపడే అవకాశం ఉంది.

నాలుగు ప్రతిపాదనలు

రష్యా-ఉక్రెయిన్ కాల్పుల విరమణ కోసం ప్రస్తుతం నాలుగు దౌత్య ప్రతిపాదనలు చర్చల్లో ఉన్నాయి. టర్కీ, ఈజిప్ట్ కలిసి నల్ల సముద్రంలో ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు వీలు కల్పించే సంధిని ప్రతిపాదించాయి. అమెరికా ఇంధన మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడంపై దృష్టి పెట్టింది. భారత్ ప్రతిపాదన మాత్రం ఇంధన రంగం, నల్ల సముద్రం అంశాలను కలిపి చూస్తోంది.

ఉక్రెయిన్ ఏం చెబుతోంది?

కాల్పుల విరమణలో ఇంధన రంగం, నల్ల సముద్రం రెండూ కలిసే ఉండాలని ఉక్రెయిన్ కోరుతోంది. ఓడరేవులు సహా అన్ని ఇంధన మౌలిక వసతులపై దాడులు పూర్తిగా ఆగాలని సిబిహా స్పష్టం చేశారు. అదే సమయంలో యుద్ధ ప్రాంతం వెంట షరతులు లేని కాల్పుల విరమణను కూడా పరిశీలించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని తెలిపారు.



మోదీపై పుతిన్ ప్రశంసలు

ఈ పరిణామాల మధ్య రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ప్రధాని నరేంద్ర మోదీ శాంతి ప్రయత్నాలను ప్రశంసించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే అంశాన్ని మోదీ పదేపదే ప్రస్తావిస్తున్నారని ఇటీవల ఓ కార్యక్రమంలో చెప్పారు. ఇరువైపులా ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం మోదీకి మంచి ఆలోచనలు ఉన్నాయని పేర్కొన్నారు. శాంతియుతంగా, త్వరగా సమస్య పరిష్కారం కావాలని మోదీ కోరుతున్నారని పుతిన్ అన్నారు.


ముందున్న సవాలు ఏంటి?

భారత్ ప్రతిపాదనకు ఉక్రెయిన్ సానుకూలంగా స్పందించినా.. కాల్పుల విరమణ అమలుకు రష్యా అంగీకారం కూడా కీలకం. ప్రస్తుతం నాలుగు ప్రతిపాదనలపై చర్చలు కొనసాగుతున్నాయి. వాటిలో ఏది ఆచరణలోకి వస్తుందన్నది రాబోయే దౌత్య చర్చలపై ఆధారపడి ఉంటుంది.

మూడు రోజుల్లో క్షమాపణలు చెప్పండి

మొదటిపేజీ తరువాయి – ఈ వ్యవహారంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, ఇందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సూచించింది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ కమిటీ, ప్రధాని వీడియో తొలగింపును ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. దేశ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాని వీడియోను తొలగించడం తీవ్రమైన విషయంగా పేర్కొంది. మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే ఫేస్‌బుక్‌కు ప్రస్తుతం ఉన్న 'సేఫ్ హార్బర్' రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉందని కమిటీ హెచ్చరించినట్టు సమాచారం. అలా జరిగితే సోషల్ మీడియా సంస్థ అధికారులపై నేరుగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. జులై 23న ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ వీడియోను పోస్టు చేశారు. తర్వాత అదే వీడియోను ఫేస్‌బుక్‌లో కూడా షేర్ చేశారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ప్రశ్నాపత్రాల లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని దాంట్లో హామీ ఇచ్చారు. అయితే ఫేస్‌బుక్‌లో ఆ వీడియో కొద్దిసేపు కనిపించకుండా పోవడంతో వివాదం చెలరేగింది. విమర్శలు రావడంతో మెటా వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించింది. ఇటీవల పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరైన మెటా ప్రతినిధులు, ఇది సాంకేతిక లోపం వల్ల జరిగిందని క్షమాపణ చెప్పారు. అయితే ఐటీ శాఖ ఆ వివరణను పూర్తిగా అంగీకరించలేదు. నిజంగా సాంకేతిక లోపమే అయితే అలాంటి సమస్యలు మళ్లీ రాకుండా మెటా తన వ్యవస్థలను మెరుగుపరచాలని సూచించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన అసభ్యకర కంటెంట్ ప్రకటనల రూపంలో కనిపిస్తున్న వ్యవహారంపైనా మెటాపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటీసు ఇచ్చింది. ఈ అంశంపై పార్లమెంటరీ కమిటీ మరోసారి హెచ్చరిక జారీ చేసింది. గూగుల్, యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్ సహా అన్ని సోషల్ మీడియా వేదికలు చిన్నారులపై లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్‌ను కట్టడి చేసే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కమిటీ స్పష్టం చేసింది. ఉల్లంఘనలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు



మొదటిపేజీ తరువాయి – ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు సాంకేతిక ప్రగతికి, పెట్టుబడులకు కేంద్రంగా నిలవనుందనడానికి విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ అమరావతి సమ్మిట్ 2026 నిలువుటద్దం పట్టింది. ఈ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. డీప్‌టెక్నాలజీ అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.500 కోట్ల వెంచర్ ఫండ్ ఏర్పాటు చేస్తూ చారిత్రక 'అమరావతి డిక్లరేషన్' విడుదల చేయడంతో పాటు, "మేకిన్ అమరావతి" సంకల్పంతో రూపొందించిన ఐదు "క్యూ-శివ" క్వాంటం కంప్యూటర్లను సీఎం ఆవిష్కరించారు. క్యూబిట్ ఫోర్స్ సంస్థ, చండీఘడ్ యూనివర్సిటీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన ఈ క్యూ-శివ కంప్యూటర్లు మినీ టెస్టింగ్ క్వాంటం ల్యాబ్‌లుగా పనిచేస్తాయి. వీటితో పాటు 4 కెల్విన్ ప్రాసెసర్ 'సృష్టి'ని కూడా ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్యూబిట్ సంస్థ సీఈఓ వెంకటసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ కంప్యూటర్ల తయారీకి అవసరమైన కొన్ని కీలక కాంపోనెంట్లు ప్రపంచంలో ఒకటి రెండు చోట్ల మాత్రమే లభిస్తాయని, అలాంటివి మన మచిలీపట్నంలో దొరకడం విశేషమని తెలిపారు. తమ ప్రయత్నానికి సీఎం చంద్రబాబు అందించిన సహకారం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. అనంతరం క్యూబిట్ ప్రతినిధుల కృషిని అభినందించిన ముఖ్యమంత్రి, వారితో కలిసి సెల్ఫీ దిగి ఉత్సాహపరిచారు.

అమరావతి డిక్లరేషన్.. డీప్‌టెక్‌కు ఊతం

ఈ సదస్సులో ఏపీ ప్రభుత్వం, పాన్ ఐఐటీ అలుమ్ని ప్రతినిధులు సంతకాలు చేసిన 'అమరావతి డిక్లరేషన్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీని ప్రకారం, అమరావతిలో ఏపీ ప్రభుత్వం-పాన్ ఐఐటీ అలుమ్ని ఇండియా ఆధ్వర్యంలో ఒక శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు కానుంది. డీప్‌టెక్ స్టార్టప్‌లు, ఆవిష్కరణలు, పెట్టుబడులను ప్రోత్సహించేందుకు రూ.500 కోట్ల పాన్ ఐఐటీ అమరావతి వెంచర్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కౌన్సిల్ ద్వారా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు, స్టార్టప్‌లను సమన్వయం చేస్తారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 10 ఇండస్ట్రీ చైర్స్ ఏర్పాటు చేయడం, 100 మంది గ్లోబల్ ఐఐటీ మెంటర్లతో స్టార్టప్‌లకు మార్గనిర్దేశం చేయడం, 23 ఐఐటీల నుంచి టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ వంటివి ఈ డిక్లరేషన్‌లోని ముఖ్యాంశాలు. క్వాంటమ్-ఏఐ, సెమీకండక్టర్లు, స్పేస్-డిఫెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించి, 2030 నాటికి కనీసం 50 స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు.

క్వాంటం వ్యాలీగా అమరావతి: సీఎం చంద్రబాబు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. "గతంలో ఐటీని ప్రోత్సహిస్తే ప్రపంచవ్యాప్తంగా మన తెలుగువారు నిపుణులుగా ఎదిగారు. ఇప్పుడిక సిలికాన్ వ్యాలీ గురించి కాదు, అమరావతిలోని క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం చర్చించుకుంటుంది" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో తాను విజన్ 2020 తీసుకువచ్చినప్పుడు కొందరు '420' అంటూ హేళన చేశారని, కానీ దాని ద్వారానే విద్యుత్, రహదారుల వంటి రంగాల్లో సంస్కరణలు వచ్చాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని, 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా ఎదగడాన్ని ఎవరూ ఆపలేరని అన్నారు. జాతి నిర్మాణంలో భాగమైన ఐఐటీయన్లు వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఐబీఎం-టీసీఎస్, ఎల్ అండ్ టీ సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న క్వాంటం కంప్యూటర్ ఆపరేషన్స్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి అమరావతి నుంచే ప్రారంభమవుతాయని చంద్రబాబు ప్రకటించారు. భవిష్యత్తులో కేవలం వినియోగించుకోవడమే కాకుండా, క్వాంటం కంప్యూటర్లను తయారు చేసి ఎగుమతి చేసే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు

-కౌకుంట్లలో ఘనంగా నివాళులర్పించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



బడంగ్‌పేట్, 04 అక్టోబర్ (విజన్ పక్షం): మాజీ మంత్రి వర్యులు, దివంగత నాయకుడు పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా కౌకుంట్లలోని ఆయన ఘాట్ (ఇంద్రారెడ్డి ఘాట్) వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యురాలు శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ఇంద్రారెడ్డి ఘాట్ వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి ప్రజల మనిషిగా, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మహానాయకుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. ఈ నివాళి కార్యక్రమంలో స్థానిక నాయకులు గట్టు మహిపాల్, కర్రె బల్వంత్, గౌర సాయి, పుట్టగల్ల సంతోష్ కుమార్, చిత్రం సాయి, సామ దర్శన్ రెడ్డిలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో వైభవంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



బడంగ్‌పేట్, 04 అక్టోబర్ (విజన్ పక్షం): మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలోని 57వ నాదర్‌గుల్ డివిజన్ అల్మాస్‌గూడలో ఆదివారం అర్హులైన కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సులభంగా చేరడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. డిజిటల్ విధానంలో అందించే ఈ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ కార్యక్రమాల ఫలాలు త్వరితగతిన, పారదర్శకంగా అందుతాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తూ, వారికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ సేవలు అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, బంగారు సత్యనారాయణ, నవారు మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక హిల్స్ కాలనీలో మురుగు నీటి సమస్య పరిష్కారం



బండ్‌గేట్, 04 అక్టోబర్ (విజన్ పక్షం): బడంగ్ పేట్ సర్కిల్ 16, నాదర్ గుల్ 57వ డివిజన్ ఆల్మస్ గూడ పరిధిలోని వినాయక హిల్స్ కాలనీ పోచమ్మ టెంపుల్ రోడ్డులో గత కొన్ని రోజులుగా రోడ్డుపై మురుగు నీరు పొంగిపొర్లుతూ స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి వెంటనే స్పందించి మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది రంగంలోకి దిగి మురుగు నీటి కాలువలను, రోడ్డును శుభ్రం చేయడంతో సమస్య తక్షణమే పరిష్కారమైంది. రోడ్డుపై మురుగు నీరు తొలగిపోవడంతో కాలనీ వాసులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు రాత్లావత్ వినోద్ నాయక్, మత్రు నాయక్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ : బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వాదనలు..!



కామారెడ్డి జిల్లా ప్రతినిధి; 04 అక్టోబర్ (విజన్ పక్షం): తాజా సర్వేలో బీసీల జనాభా '50.42 శాతం'గా ఉంది.. దీని ఆధారంగా బీసీ రిజర్వేషన్లు నిర్ణయించాం. తాజా డేటాను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. బిపట్టణ స్థానిక సంస్థల్లో 33.33% బీసీ రిజర్వేషన్లు, మొత్తం రిజర్వేషన్లు 49.24% మాత్రమేనన్న ఏపీ ప్రభుత్వం. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

ఆర్వీఆర్ కాలనీలో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు



బడంగ్‌పేట్, 04 అక్టోబర్ (విజన్ పక్షం): బడంగ్‌పేట్ సర్కిల్, నాదర్‌గుల్ 57వ డివిజన్ పరిధిలోని ఆర్వీఆర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి ఆదివారం కాలనీవాసులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ పనులను పూర్తి చేయడానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. అలాగే అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని, రాత్రి వేళల్లో వెలగడానికి సరిపడా స్ట్రీట్ లైట్లు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు వాపోయారు. ఆర్వీఆర్ కాలనీ సమగ్ర అభివృద్ధికి తగిన నిధులు మంజూరు అయ్యేలా చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నవారు మల్లారెడ్డి మాట్లాడుతూ... కాలనీ సమస్యలను మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్ల సమస్యల పరిష్కారానికి, తగిన నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోకి కొత్తగా విలీనమైన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ తగిన చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో నవారు మల్లారెడ్డితో పాటు ఆర్వీఆర్ కాలనీ అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రమావత్ భాషా, శ్రీశైలం, శ్రీనివాస్, శంకర్ జీ, రవీందర్, మోతీలాల్, రామాచారి, అశ్విన్, ప్రవీణ్, ఆనంద్ చారి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీల రిజర్వేషన్ మరియు బీసీల అభివృద్ధి చంద్రబాబు నాయుడు గారికే సాధ్యం

నాగేశ్వరరావు యాదవ్ డిసిఎంఎస్ చైర్మన్ మరియు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు....



నంద్యాల జిల్లా, డోన్ ప్రతినిధి గణేష్, 04 అక్టోబర్ (విజన్ పక్షం): నంద్యాల జిల్లా డోన్ పట్టణం నందు మధు ఫంక్షన్ హాల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై నాగేశ్వరరావు గారి ఆధ్వర్యంలో బీసీల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, నాగేశ్వరరావు యాదవ్ మరియు బీసీ నాయకులు మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో గల బీసీలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం పటిష్టం చేయుట కొరకు రాష్ట్ర అధికార ప్రతినిధిగా రామచంద్ర నాయుడు గారిని, డోన్ మహిళ అధ్యక్షురాలుగా వాల్మీకి కుమారి గారిని, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడిగా బెస్త మల్లయ్య గారిని నియమించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్థానిక సంస్థలలో బీసీలకు కేటాయించిన 34% శాతం రిజర్వేషన్లను కొట్టివేసిన నైపథ్యంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చాలెంజ్ గా తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి రాజ్యాంగ సవరణకు చర్యలు తీసుకోవాలని బి.సి సంఘాలు డిమాండ్ చేశాయి. దీనిపై సుప్రీంకోర్టుకు ఆపిల్ కి వెళ్లిన ఆశించిన ప్రయోజనం వచ్చే అవకాశాలు తక్కువ. ఇప్పటికే సుప్రీంకోర్టు 5 మంది జడ్జి లతో ధర్మాసనం 2010 నుంచి తీర్పులు ఉన్నవి. ఇప్పుడు సుప్రీంకోర్టుకు వెళితే 7మంది - 9మంది జడ్జిల్లా ధర్మాసనం పెట్టాలని కోరితే అప్పుడు తీర్పు వస్తే సక్సెస్ అయ్యే అవకాశం ఉంటుంది. లేకపోతే ఫలితం ఉండదు.ఇప్పటికే అనేక రాష్ట్రాలలో 2010 నుంచి వరుసగా కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో బి.సి రిజర్వేషన్లను కొట్టివేశారు. ఇప్పుడు వెళ్ళిన లాభం లేదు. దీనికంటే రాజ్యాంగ సవరణయే శాశ్వత పరిష్కారం.బీసీలు 56% జనాభా ఉంటే విద్యా, ఉద్యోగాలలో 25 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అన్యాయం చేస్తున్నారు ఇక రాజకీయ రిజర్వేషన్లు, చట్టసభలలో రిజర్వేషన్లు ఊసే లేదు. ఇంకా అర కొరగా స్థానిక సంస్థలలో బీసీల రిజర్వేషన్లు ఇస్తుంటే దాన్ని కూడా ఓర్వలేకపోతున్నారు. బీసీలు 56 శాతం జనాభా ఉంటే 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే దీనిని కూడా కోర్టు కొట్టు వేయడం దుర్మార్గం. కోర్టులు బి.సి రిజర్వేషన్లను లెక్క చేయకుండ కొట్టి వేయడం ఒక సంప్రదాయంగా వస్తుంది. దీనికి రాజ్యాంగ పరష్కారం కావాలి.గత 15 సంవత్సరాలుగా హైకోర్టు సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్లలో 50 శాతం పరిమితి దాటరాదంటూ కొట్టు వేయడం ఒక సంప్రదాయంగా మారింది. 50శాతం గరిష్ట పరిమితి నిబంధన రాజ్యాంగంలో లేదు. ఏ చట్టంలో లేదు. ఒక బీసీ రిజర్వేషన్లకే ఎందుకని ప్రశ్నించారు. త్రిపుర, మేఘాలయ తదితర ఈశాన్య రాష్ట్రాలలో ఎస్సీ/ ఎస్టీలకు కలిపి 70 నుంచి 90% రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. కానీ బీసీల విషయానికొస్తే 50 శాతం పరిమితి చూపడం సరికాదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు చొరవ తీసుకొని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారితో చర్చలు జరిపితే రాజ్యాంగ సవరణ చర్యలు తీసుకుంటారు. సమస్య తీరుతుంది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లతో కలుపుకొని కేంద్ర పై ఒత్తిడి తెచ్చి రాజ్యాంగ సవరణ కోసం గట్టి ప్రయత్నం చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు చొరవ తీసుకుంటే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. చరిత్రలో నిలిచిపోతారు.ఈ సమస్య శాశ్వత పరిష్కారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తప్ప ఎవరికి సాధ్యం కాదు. ప్రధానితో, కేంద్ర ప్రభుత్వంతో మంచి సంబంధాలు ఉన్నాయని, రాజ్యాంగ సవరణ చేయిస్తే చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారని అన్నారు.





మార్క్స్--లెనిన్‌ల ఉత్తమ శిష్యులుగా ఉండడమే మంచి కమ్యూనిస్ట్ లక్షణం

చీడపురుగులను ఏరివేయాలంటే అధ్యయనమే ఆయుధం

బోనకల్ 04 అక్టోబర్ (విజన్ పక్షం): వర్గరహిత సమాజాన్ని సాధించాలంటే ప్రతి కమ్యూనిస్ట్ మార్క్స్, లెనిన్‌ల ఉత్తమ శిష్యుడిగా ఎదగాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు అన్నారు. సమాజాన్ని మార్చాలంటే కేవలం కమ్యూనిస్టుగా చెప్పుకునే వారు సరిపోరని, నిరంతరం అధ్యయనం చేస్తూ సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే కార్యకర్తలు అవసరమని తెలిపారు. ఆదివారం బోనకల్ సీపీఎం కార్యాలయంలో "మంచి కమ్యూనిస్ట్ ఎలా ఉండాలి?" అనే అంశంపై స్టడీ సర్కిల్ నిర్వహించారు. స్టడీ సర్కిల్ కన్వీనర్ తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పల్లా కొండలరావు మాట్లాడుతూ మార్క్సిజం పిడివాదం కాదని, సర్వకాల సర్వావస్థలలలోనూ ఒక సామాజిక, తత్వ శాస్త్రమని, నిర్దిష్ట పరిస్థితులకు దానిని అన్వయించి మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు మొదటిగా లెనిన్ కృషి చేశారని వివరించారు. మార్క్స్, లెనిన్‌లు మానవాతీత శక్తులు కాదని, స్వీయ సాధన ద్వారా ప్రతి కమ్యూనిస్ట్ కూడా వారి మాదిరిగా అద్వితీయమైన సైద్ధాంతిక అవగాహనను పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. పరిస్థితులను అర్థం చేసుకుని, సిద్ధాంతాన్ని వాటికి అన్వయించి ఆచరించడంలో నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రతి కమ్యూనిస్టు స్వీయ సాధన చేస్తే తనను తాను అభివృద్ధి చేసుకోవడమే గాక మొత్తం మానవాళిని పట్టిపీడిస్తున్న బుగ్గతలకు మందులా పరిష్కారాలు చూపే కాగడానే మార్క్స్ సిద్ధాంతం అన్నారు. మార్క్స్ స్వయంగా పోరాటయోధుడని, అరుదైన విప్లవకారుడని, శ్రామికవర్గ విముక్తితో పాటు ప్రపంచ ప్రజానీకం విముక్తి కోసం సిద్ధాంతాన్ని రూపొందించేందుకు తన కుటుంబ, వ్యక్తిగత జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారని ఎంగెల్స్ చెప్పిన విషయాలను పల్లా కొండలరావు ప్రస్తావించారు. చిన్న చిన్న విజయాలపై కేంద్రీకరించడం ద్వారా పెద్ద విజయాలను సాధించేందుకు అవి ఆయుధాలుగా ఉపయోగపడతాయని లెనిన్ ఆదేశించినట్లు కామ్రేడ్ స్టాలిన్ పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రతి చిన్న విజయాన్ని భవిష్యత్తులో సాధించాల్సిన పెద్ద విజయాలకు పునాదిగా మలచుకోవాలని సూచించారు. మార్క్స్ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోకుండా పడికట్టు పదాలతో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ, కార్యకర్తలపై పెత్తనం చేస్తూ, తమకు తామే నాయకులుగా, గొప్ప సిద్ధాంతవేత్తలుగా ప్రకటించుకునేవారు కమ్యూనిస్ట్ పార్టీలో "చీడ పురుగుల్లాంటి వారు" అని చైనాకు చెందిన ప్రముఖ మార్క్సిస్టు సిద్ధాంతవేత్త లీ షావ్ చీ చెప్పిన విషయాన్ని పల్లా కొండలరావు ప్రస్తావించారు. అలాంటి వారు సరైన సైద్ధాంతిక అవగాహన పెంచుకుని ఆచరణలో నిరూపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యకర్తలు కూడా నిరంతరం అధ్యయనం చేసి, సైద్ధాంతిక అవగాహనను పెంచుకుని అలాంటి ధోరణులను ప్రశ్నించాలని, అలాంటివారిని పార్టీనుండి ఏరివేసి పార్టీని రక్షించుకోవాలని సూచించారు. అదే సమయంలో మార్క్సిజాన్ని అవగాహన చేసుకుని త్యాగాలతో పార్టీ కోసం, ప్రజల కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారి సంఖ్య నేటికీ కమ్యూనిస్టుల్లోనే ఎక్కువగా ఉందన్నారు. అయితే ఆ స్థితితో సంతృప్తి చెందకుండా ప్రతి సభ్యుడు నిరంతరం తనను తాను సమీక్షించుకోవాలని, వ్యక్తిగతంగా ఎదుగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. లెనిన్ చెప్పినట్లు నూతన జీవన విధానాన్ని, నూతన సంస్కృతిని, నూతన సమాజాన్ని నిర్మించేందుకు నిరంతరం అధ్యయనం చేయడం, మెలుకువగా పరిస్థితులను గమనించడం, సిద్ధాంతాన్ని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి ఆచరించడం, ఆచరణ ఫలితాలను సమీక్షించుకుని ముందడుగు వేయడమే మార్క్సిస్టు ఆచరణ అని పల్లా కొండలరావు అన్నారు. అలాంటి నిరంతర అధ్యయనం, ఆచరణ, స్వీయ సమీక్ష కలిగిన వారే మార్క్స్, లెనిన్‌ల ఉత్తమ శిష్యులుగా నిలవగలరని తెలిపారు. ఈ స్టడీ సర్కిల్‌లో సీపీఎం జిల్లా నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, ఐద్వా మధిర డివిజన్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ సునీత, సీఐటీయూ నేతలు గుగులోతు నరేష్, బోయినపల్లి వీరబాబు, కూచిపూడి మురళి, బొప్పాల రమేష్, కంసాని సూర్యప్రకాశావు, బూర్గుల అప్పాచారి, బిల్లా విశ్వనాథం, గద్దె రామారావు, కుక్కల కోటేశ్వరరావు, ఇమ్మడి వెంకటేశ్వర్లు, పొన్నం ఉపేందర్, చామర్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





స్థానిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలన్న ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు

ఒమ్మంగిలో మండల అధ్యక్షుడు రామిశెట్టి నాని అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం

పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉంటా. ముద్రగడ..

వెన్నుపోటు ప్రభుత్వం వెన్నుపోటు పాలనపై.చేపట్టిన సమావేశం...

ప్రత్తిపాడు 04 అక్టోబర్ (విజన్ పక్షం): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ అధ్యక్షతన 'వెన్నుపోటు ప్రభుత్వం--వెన్నుపోటు పాలనపై పోరు' తో మండల విస్తృతస్థాయి సమావేశం, నిర్వహించారు. ముందుగా దివంగత మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గిరిబాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు.సమావేశంలో తాజా మాజీ జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, తో పాటు మాజీ ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జలిగంపల ప్రభాకర్ రావు, బంకు శ్రీను, దలే చిట్టిబాబు, గోణగాల అప్పలరాజు, దాడిశెట్టి చక్రధర్, పిలాచిన్న,

తమన్ టాప్ 3 లెక్క.. ఇది గమనించారా..



ముఖ్యంగా సోషల్ మీడియా జనరేషన్ లో ఒక్క పాట క్లిక్ అయితే చాలు.. సినిమా మీద హైప్ ఒక్కసారిగా పెరిగిపోతుంది.

సినిమా విజయానికి మ్యూజిక్ ఎంత కీలకమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదేమో. ముఖ్యంగా సోషల్ మీడియా జనరేషన్ లో ఒక్క పాట క్లిక్ అయితే చాలు.. సినిమా మీద హైప్ ఒక్కసారిగా పెరిగిపోతుంది. ఆ విషయంలో టాలీవుడ్ ఇండస్ట్రీలో మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ తమన్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. మాస్ బీట్స్, క్యాచీ ట్యూన్స్, సోషల్ మీడియాలో వైరల్ అయ్యే సాంగ్స్ ఇవ్వడంలో తమన్ స్టైల్ వేరు అని అభిమానులు చెబుతుంటారు. ప్రస్తుతం యూట్యూబ్ లో 600 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తెలుగు పాటల జాబితాలో టాప్ 3 స్థానాల్లో ఉన్న పాటలన్నీ తమన్ సంగీతం అందించినవే కావడం విశేషంగా మారింది. అందులో మొదటి రెండు పాటలు అలా వైకుంఠపురంలో చిత్రంలోని సాంగ్స్ కావడం మరింత ఆసక్తికరం. ఆ సినిమాలోని బుట్టబొమ్మ పాట ఇప్పటికే సుమారు 890 మిలియన్ల వ్యూస్‌తో దూసుకుపోతుండగా, రాములో రాములా పాట 695 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. ఆ రెండు పాటలు ఇప్పటికీ సోషల్ మీడియాలో, షార్ట్ వీడియో ప్లాట్ ఫార్మ్ లో ట్రెండ్ అవుతూనే ఉన్నాయి. అల్లు అర్జున్ స్టైల్, తమన్ సంగీతం, క్యాచీ లిరిక్స్ కలిసి ఆ సాంగ్స్ ను పాన్ ఇండియా స్థాయిలో పాపులర్ చేశాయి. ఇప్పుడు అదే జాబితాలో మూడో పాటగా చేరింది గుంటూరు కారం సినిమాలోని కుర్చీ మడతపెట్టి. ఆ పాట రీసెంట్ గా యూట్యూబ్ లో 600 మిలియన్ల వ్యూస్ మార్క్ ను దాటింది. అంతేకాదు.. అత్యంత వేగంగా ఆ ఫీట్ అందుకున్న తెలుగు పాటల్లో ఒకటిగా నిలిచింది. సినిమా బాక్సాఫీస్ వద్ద మిక్స్డ్ రెస్పాన్స్ తెచ్చుకున్నప్పటికీ, పాటలు మాత్రం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. కుర్చీ మడతపెట్టి పాట విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రీల్స్, షార్ట్ వీడియోలు, కవర్ సాంగ్స్.. ఇలా ఎక్కడ చూసినా ఇదే పాట వినిపించింది. ముఖ్యంగా ఆ సాంగ్ కు యువత నుంచి భారీ రెస్పాన్స్ వచ్చింది. మాస్ బీట్ కు తగ్గట్టు తమన్ ఇచ్చిన ట్యూన్, ప్రేక్షకులను వెంటనే కనెక్ట్ అయ్యేలా చేసింది. ఆ పాటకు సాహిత్యం అందించిన రామజోగయ్య శాస్త్రి ప్రత్యేక శైలిలో లిరిక్స్ రాయగా, సాహితి చాగంటి, శ్రీకృష్ణ జోష్ లో ఆలపించారు. ఇక కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కంపోజ్ చేసిన స్టెప్పులు పాటకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. ఇందులో మహేష్ బాబు వేసిన ఎనర్జిటిక్ డ్యాన్స్ అభిమానులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. అలాగే హీరోయిన్ శ్రీలీల కూడా తన డ్యాన్స్ తో పాటకు ఎక్స్ట్రా అట్రాక్షన్ గా నిలిచింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఏజెంట్ తాత డైలాగ్ నుంచి ఆ పాటను రూపొందించారనే విషయం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. ఆ వైరల్ పదాలను మాస్ బీట్ గా మార్చి తీసుకెళ్లడంలో తమన్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి ఇప్పుడు 600 మిలియన్ల వ్యూస్ క్లబ్ లో టాప్ 3 తెలుగు పాటలు కూడా తమన్ ఖాతాలో ఉండటం.. టాలీవుడ్ మ్యూజిక్ వరల్డ్ లో ఆయన డామినేషన్ ను ఎగ్జాంపుల్!!




బాలీవుడ్ లో ఆ సినిమా సీక్రెట్ చేప్పేసిన సాయిపల్లవి!

ఏక్ దిన్- చిత్రంతో సాయి పల్లవి బాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో అమ్మడు ఆమిర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన నటించింది. ఇటీవలే రిలీజ్ అయిన సినిమాకు డివైడ్ టాక్ వచ్చింది. సాయి పల్లవి పాత్రకు మాత్రం గుర్తింపు దక్కింది. నటన పరంగా అమ్మడు పాసై పోయింది. అయితే ఈ సినిమాతోనే సాయి పల్లవి బాలీవుడ్ లో లాంచ్ అవ్వడానికి గల కారణాలు ఏంటి? అనే కొంత డిస్కషన్ కూడా జరుగుతోంది.ఈ నేపథ్యంలో తాజాగా సాయిపల్లవి అందుకు గల కారణాన్ని రివీల్ చేసింది. -ఏక్ దిన్- కథ విన్న వెంటనే ఆమెకు హాలీవుడ్ క్లాసిక్ చిత్రం -బిఫోర్ సన్‌రైజ్- గుర్తొచ్చింది. ఒకే రోజులో సాగే కథ ఇది. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే సంభాషణలు, వారి భావోద్వేగాల చుట్టూ తిరిగే ఆ హాలీవుడ్ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. ఏక్ దిన్- స్క్రిప్ట్‌లో కూడా అదే తరహా స్వచ్ఛత, గాఢత ఉండటంతో సాయి పల్లవి మరో ఆలోచన లేకుండా ప్రాజెక్టును ఓకే చేసినట్లు తెలిపింది. సాధారణంగా బాలీవుడ్ అరంగేట్రం అంటే? హీరోయిన్లు భారీ కమర్షియల్ హంగులు, గ్లామర్ ఉన్న సినిమాలను ఎంచుకుంటారు. కానీ సాయి పల్లవి మాత్రం నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రనే ఎంచుకుంది. నేను ఎప్పుడూ కథలోని లోతును, నా పాత్ర ఇచ్చే సంతృప్తిని మాత్రమే చూస్తాను. బిఫోర్ సన్‌రైజ్ లాంటి క్లాసిక్ వైబ్‌ని ఈ కథలో చూసినప్పుడు ఒక నటిగా నాలోని ఆసక్తిని అది రేకెత్తించింది- అని వెల్లడించింది. ఈ నిర్ణయంతో ఆమెలోని కళాత్మక దృక్పథాన్ని మరోసారి చాటిచెప్పింది. ఈ సినిమాలో సాయి పల్లవి సాధారణ అమ్మాయిగా, ఎంతో సహజంగా కనిపిస్తుంది. కేవలం మాటలు, చూపులతోనే హావభావాలను పలికించాల్సిన పాత్ర ఇది. హాలీవుడ్ సినిమాల్లో ఉండే ఆ నెమ్మదైన కథనం, పాత్రల మధ్య ఉండే కెమిస్ట్రీని ఈ సినిమా ద్వారా బాలీవుడ్ ప్రేక్షకులకు అందించొచ్చని అమ్మడు బలంగా నమ్మింది. ఇంకొక పెద్ద పని పూర్తయినట్లే.. సాయి పల్లవి నటనలోని సహజత్వం పాత్రకు మరింత ప్రాణం పోసిందని, జునైద్ ఖాన్‌తో ఆమె కెమిస్ట్రీ కూడా ఎంతో హుందాగా ఉందని విమర్శకులు ప్రశంసిస్తున్నారు. ప్రాంతీయ భాషా నటిగా ఉండి హిందీలో తొలి ప్రయత్నంలోనే ఇలాంటి ప్రయోగాత్మక కథను ఎంచుకోవడం సాహసమే అని చెప్పాలి.

కానీ సాయి పల్లవికి ఉన్న నేచురల్ స్టార్ ఇమేజ్ ఈ సినిమాకు ప్లస్ పాయింట్ గా కలిసొచ్చింది. బాలీవుడ్ ప్రేక్షకులు కూడా ఆమెలోని ప్రతిభను గుర్తించి ఆదరిస్తున్నారు. ప్రస్తుతం సాయి పల్లవి బాలీవుడ్ రామాయణ్ లోనూ నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో సీత పాత్రలో నటించనుంది. ఈ సినిమా విజయం తర్వాత సాయి పల్లవి స్టార్ డమ్ బాలీవుడ్ లో ఆకాశాన్నే అంటుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

తగ్గిన సమంత 'బంగారం' .. ఒరిజినల్ రీజన్ ఇదేనా?

స్టార్ హీరోయిన్ సమంత లీడ్ రోల్ లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ మా ఇంటి బంగారంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత సమంత పూర్తి స్థాయి పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్న ఆ సినిమాపై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. దర్శకురాలు నందిని రెడ్డి తెరకెక్కిస్తున్న ఆ చిత్రాన్ని సమంత తన సొంత నిర్మాణ సంస్థపై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 00:00 / 02:25 ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి హైప్ తీసుకొచ్చింది. సాధారణ గృహిణిలా కనిపించే మహిళ.. అవసరమైతే ఎంతటి పరిస్థితినైనా ఎదుర్కొనే పవర్ ఫుల్ లేడీగా మారే పాత్రలో సమంత కనిపించనుందనే టీజర్ ద్వారా క్లారిటీ వచ్చేసింది. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో సమంత లుక్ అభిమానులను ఆకట్టుకుంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, ఉమెన్ ఓరియంటెడ్ స్టోరీతో చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు రీసెంట్ గా మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. నిజానికి ఆ చిత్రాన్ని మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ ఇప్పుడు రిలీజ్ డేట్ ను జూన్ 19కు మార్చినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అదే సమయంలో వాయిదా వేయడానికి ఐపీఎల్ కారణమని మూవీ టీమ్ చెబుతోంది. ఐపీఎల్ సీజన్ సమయంలో థియేటర్లకు ప్రేక్షకుల రాక తగ్గే అవకాశం ఉండటంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా పెద్ద సినిమాలు, కుటుంబ ప్రేక్షకులను టార్గెట్ గా పెట్టుకున్న చిత్రాలపై ఐపీఎల్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుందని అంతా భావిస్తుంటారు. అయితే ఇప్పుడు నెట్టింట మరో టాక్ వినిపిస్తోంది. ఐపీఎల్ కారణం కేవలం ఒక ఎక్స్క్యూస్ మాత్రమేనని ప్రచారం జరుగుతోంది. అసలు సమస్య థియేటర్లు దొరకకపోవడమేనని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం భారీ సినిమాల పోటీ, థియేటర్ల కేటాయింపు సమస్యల కారణంగా మా ఇంటి బంగారం మూవీకి సరైన రిలీజ్ ప్లానింగ్ కుదరలేదని అంటున్నారు. ముఖ్యంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న పెద్ది సినిమా థియేటర్లపై భారీ ప్రభావం చూపించే అవకాశం ఉండటంతో.. ఆ సినిమా రన్ పూర్తయ్యాక సమంత సినిమా విడుదల చేయాలని నిర్మాతలు భావించినట్లు టాక్ నడుస్తోంది. మంచి రిలీజ్ టైమ్ దొరికితేనే సినిమాకు కలెక్షన్లు స్ట్రాంగ్ గా వచ్చే అవకాశం ఉందని మేకర్స్ లెక్కలు వేసుకుంటున్నారట. ఇక సమంత అభిమానులు మాత్రం సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గత కొంతకాలంగా లేడీ ఓరియెంటెడ్ కథలపై ఎక్కువగా దృష్టి పెడుతున్న సమంత.. మా ఇంటి బంగారం చిత్రంతో మరోసారి తన యాక్టింగ్ లోని మరో యాంగిల్ ను చూపించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. విడుదల లేట్ అయినా సరే.. మంచి కంటెంట్ తో వస్తే సినిమా కచ్చితంగా ఆకట్టుకుంటుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.



భార్యాభర్తలుగా రియల్ లైఫ్ కు దూరంగా!



మెగా కపుల్స్ వరుణ్ తేజ్ - లావణ్య త్రిపాఠి వివాహం అనంతరం మళ్ళీ ఎప్పుడు కలిసి నటిస్తారా? అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకు సమయం ఆసన్నమైనట్లు తెలుస్తోంది. -మిస్టర్-, -అంతరిక్షం- లాంటి సినిమాలతో వెండితెరపై మెరిసిన జోడీ నిజ జీవితంలో ఒకటైన తర్వాత తదుపరి ప్రాజెక్టు విషయంలో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలిసి నటించే సినిమా గురించి తాజాగా లావణ్య త్రిపాఠి చేసిన వ్యాఖ్యలు ఫిలిం నగర్‌లో చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా రియల్ లైఫ్ కపుల్స్ అనగానే? దర్శకులు వారి కోసం భార్యాభర్తల కథలను లేదా వారి వ్యక్తిగత జీవితానికి దగ్గరగా ఉండే స్క్రిప్ట్‌లను సిద్ధం చేస్తుంటారు. లావణ్యకు కూడా ఇటీవల అలాంటి కథ ఒకటి వచ్చిందట. వారిద్దరి నిజ జీవిత కెమిస్ట్రీకి అద్దం పట్టేలా సాఫ్ట్ లవ్ స్టోరీ ఫ్యామిలీ డ్రామా తరహాలో ఆ కథ ఉందని సమాచారం. అయితే అచ్చంగా తమ రియల్ లైఫ్‌ను ప్రతిబింబించే పాత్రలు చేయడం లావణ్యకు పెద్దగా ఇష్టం లేదని అంటున్నారు. వరుణ్ కూడా అలాగే ఆలోచిస్తున్నాడుట. నిజ జీవితానికి దూరంగా ఓ సరికొత్త నేపథ్యంలో సినిమా చేయాలని లావణ్య ఆశపడుతున్నారు. తెరపై కూడా భార్యాభర్తలుగా కనిపిస్తే? ప్రేక్షకులకు పెద్దగా కొత్తదనం అనిపించకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. అందుకే ఒకరికొకరు సంబంధం లేని పాత్రల్లోనో? లేదా? ఒకరిపై ఒకరు తలపడే వైవిధ్యమైన పాత్రల్లోనో కనిపిస్తే బాగుంటుందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో వరుణ్ తేజ్ కూడా లావణ్యతో ఏకీభవిస్తున్నట్లు తెలుస్తోంది. వరుణ్ తేజ్ ఎప్పుడూ ప్రయోగాత్మక చిత్రాలకు మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలోనే ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రావాలంటే? అది కచ్చితంగా ఛాలెంజింగ్ ప్రాజెక్ట్ అయి ఉండాలని ఆయన కోరుకుంటున్నారు. రొటీన్ ఫ్యామిలీ డ్రామాల కంటే యాక్షన్ థ్రిల్లర్ లేదా పీరియాడిక్ డ్రామా వంటి కథలైతే తమ నటనలోని కొత్త కోణాలను ఆవిష్కరించొచ్చని యోచిస్తున్నట్లున్నారు. కంటెంట్ కోసం జతకట్టాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ సొంత ప్రాజెక్టులతో బిజీగా ఉండగా లావణ్య కూడా వెబ్ సిరీస్ , సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇద్దరు కలిసి నటించే అవకాశం వస్తే? అది కేవలం ఒక కమర్షియల్ సినిమాలా కాకుండా ప్రేక్షకులకు ఒక సర్ప్రైజ్ ఇచ్చేలా ఉండాలని ప్లాన్ చేస్తున్నారు. కథలో దమ్ముంటేనే పాత్రలు విభిన్నంగా ఉంటేనే తాము స్క్రీన్ షేర్ చేసుకుంటామని పరోక్షంగా హింట్ ఇచ్చారు. వరుణ్-లావణ్యల ఆలోచనా దృక్పథం చాలా పరిణతితో కూడుకుంది. నిజ జీవిత బంధాన్ని వెండితెరపై క్యాష్ చేసుకోవాలని చూడకుండా నటీనటులుగా బాధ్యతను గుర్తించడం అభినందనీయం. ఇద్దరు కోరుకున్నట్లుగా ఏదైనా విభిన్నమైన కథ దొరికితే వెండితెరపై మెగా జంట మ్యాజిక్ చేసే అవకాశం ఉంది.

బాలయ్య కోసం హిందీ బ్యూటీ.. మరిన్ని ఛాన్సులు పక్కానా?

నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చీదీఖ111పై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీర సింహారెడ్డి తర్వాత ఆ ఇద్దరి కాంబో మళ్లీ రిపీట్ అవుతుండటంతో ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఆ సినిమాకు సంబంధించిన స్పెషల్ సాంగ్ వార్త ఇప్పుడు నందమూరి అభిమానుల్లో మరింత హైప్ పెంచుతోంది. చిత్రంలో ఓ మాస్ స్పెషల్ సాంగ్ కోసం బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీని తీసుకున్నట్లు సమాచారం. రాక్ స్టార్ సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న నర్గీస్, ఇటీవల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు మూవీలో కూడా కనిపించారు. ఇప్పుడు బాలయ్య సరసన ఐటెం సాంగ్ చేయడానికి సిద్ధమవడం ఆసక్తికరంగా మారింది. సమాచారం ప్రకారం, ఆ స్పెషల్ సాంగ్ షూటింగ్ ను హైదరాబాద్ లో ప్రత్యేకంగా వేసిన భారీ సెట్ లో మే 8 నుంచి ప్రారంభించనున్నారట. బాలయ్య మాస్ స్టెప్పులు, నర్గీస్ ఫక్రీ గ్లామర్ కలిస్తే ఆ పాట థియేటర్లలో అభిమానులకు పూనకాలు తెప్పించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా బాలకృష్ణ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ కు ఎప్పుడూ ప్రత్యేకమైన క్రేజ్ ఉండటంతో ఆ పాటపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. దర్శకుడు గోపీచంద్ మలినేని గతంలో వీరసింహారెడ్డిలో కూడా ప్రత్యేక పాటను గ్రాండ్ గా తెరకెక్కించి ఆకట్టుకున్నారు. ఈసారి మరింత స్టైలిష్ గా, మాస్ ఆడియన్స్ ను టార్గెట్ చేస్తూ సాంగ్ ను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంగీత దర్శకుడు తమన్ పాటకు హై ఎనర్జీ బీట్ సిద్ధం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇక హీరోయిన్ విషయంలో కూడా పలు మార్పులు జరిగినట్లు తెలుస్తోంది. మొదట ఆ చిత్రంలో హీరోయిన్ గా నయనతారను అధికారికంగా ప్రకటించారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ కు మంచి స్పందన వచ్చింది. అయితే డేట్స్ సమస్యలు, రెమ్యునరేషన్, ప్రమోషన్స్ కు సంబంధించిన కొన్ని అంశాల కారణంగా ఆమె ఆ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నట్లు, దీంతో మేకర్స్ వెంటనే టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ ను ఫైనల్ చేసినట్లు సమాచారం. గతంలో బాలయ్యతో కలిసి భగవంత్ కేసరిలో నటించిన కాజల్ కు మంచి రెస్పాన్స్ రావడంతో ఆ జోడీని మళ్లీ రిపీట్ చేస్తున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ లో బాలయ్య, కాజల్ పై కీలక సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇక సినిమా విషయానికొస్తే.. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై వెంకట్ సతీష్ కిలారు భారీ బడ్జెట్ తో చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్ తో రూపొందుతున్న ఆ సినిమా వచ్చే ఏడాది భారీ స్థాయిలో విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక నర్గీస్ ఫక్రీ.. బాలయ్య మూవీలోని స్పెషల్ సాంగ్ తర్వాత టాలీవుడ్ లో మరిన్ని అవకాశాలు అందుకుంటుందా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

తాజాగా ఆ సినిమాకు సంబంధించిన స్పెషల్ సాంగ్ వార్త ఇప్పుడు నందమూరి అభిమానుల్లో మరింత హైప్ పెంచుతోంది.



నెట్‌ఫ్లిక్స్‌లో సైఫ్ అలీ ఖాన్ క్రైమ్ థ్రిల్లర్ 'కర్తవ్య'.. ట్రైలర్ రిలీజ్



బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ 'కర్తవ్య'. ఈ చిత్రం నేరుగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో సందడి చేయబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ మూవీలో సైఫ్ అలీ ఖాన్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా తన నటనతో కట్టిపడేశారు. తన వృత్తిలో నిజాయతీగా ఉంటే స్వయంగా తన కుటుంబ సభ్యుల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని తెలిసినప్పటికీ, ఒక అధికారిగా తన కర్తవ్యాన్ని ఆయన ఎలా నిర్వహించారు అనే ఉత్కంఠభరిత అంశాలతో ఈ సినిమా సాగనుంది. విలక్షణ దర్శకుడు పులకిత్ తెరకెక్కించిన ఈ చిత్రం మే 15వ తేదీ నుంచి ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సినిమాను బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ సతీమణి గౌరీ ఖాన్ నిర్మించడం విశేషం.